ప్రజాశక్తి
మంగళవారం 16 జులై 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఒంగోలులోనే ఉంటా..

నీ అక్రమాలపై పోరాడతా..

- రాజుపాలెం వద్ద 100 ఎకరాల ప్రభుత్వ భూమిని జనార్ధన్ ఆక్రమించారు..
- మా వాళ్లపై దాడులు చేస్తే సహించను
- ఎమ్మెల్యే దామచర్లపై మాజీ ఎమ్మెల్యే బాలినేని ఆగ్రహం



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'నాపై అనేక అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. భూ కబ్జాలు అంటున్నారు. మీరు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. మీకు చేతనైతే నామీద చేసిన ఆరోపణలు రుజువు చేయండి. చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌కు కూడా ఇదే నేను విజ్ఞప్తి చేస్తున్నా. అవినీతి మీరు చేస్తూ నాపై ఆరోపణలు చేస్తు న్నారు. దీన్ని నేను సహించను.. ఒంగోలులోనే ఉంటా.. నీ అక్రమాలపై పోరాడతా' అంటూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల లో ఓటమి అనంతరం హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన సోమవారం మొదటిసారి ఒంగోలుకు వచ్చారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డికి వైసిపి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల భారీ ర్యాలీ మధ్య బాలినేని శ్రీనివాసరెడ్డి లాయర్‌పేటలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. తనను హవాలా మంత్రి అన్నారని, హవాలా చేసిన ▶ 2లో

బాలినేని విల్లాస్‌పై

ఇంటెలిజన్స్ అధికారులతో విచారణ

- ఒంగోలుకు బాలినేని చేసింది శూన్యం
- లేనిపోని ఆరోపణలు చేస్తే సహించను
- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆగ్రహం



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హెచ్చరించారు. బాలినేనికి చెందిన శ్రీకర విల్లాస్‌లో పక్కాగా అవినీతి జరిగిందని, వీటిపై ఇంటెలిజన్స్ అధికారులతో విచారణ జరిపిస్తామన్నారు. విల్లాస్‌లోకి అధికారులే వస్తారుని, వాళ్లే విచారణ చేస్తారన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఒం గోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడారు. బాలినేని శ్రీనివాసరెడ్డి అనవసరంగా తనపై విమర్శలు చేశారని, ఇంత ఘోరంగా ఓడిపోయినా బాలినేనికి సిగ్గు రాలేదని ఎద్దేవా చేశారు. ఓటమిపై సమీక్ష చేసుకోకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నా డని, అమాయక చక్రవర్తిలా బాలినేని నటిస్తున్నాడన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి కార్యకర్తలపై వైసిపి నేతలు దాడి చేయలేదా.? అని ప్రశ్నించారు. వాడు, వీడు అని అసభ్య పదజాలంతో మాట్లాడితే బాలినేని కొవ్వు దించుతానని, ఇంకొక్కసారి మాట్లాడితే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. బాలినేని ఎన్నికల ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

అర్జీల పట్ల అశ్రద్ధ వహిస్తే సహించం..

కలెక్టర్ జె.వెంకటమురళి

▶ 8లో



జాయింట్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతుసంఘం నాయకులు

గుంటూరు ఛానల్‌ను

పర్చూరు వరకు పొడిగించాలి

- రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి..
- కలెక్టర్‌కు నల్లమడ రైతుసంఘం నేతల వినతి



నల్లమడ రైతుసంఘం నేతల నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, నల్లమడ వాగును అభివృద్ధి చేయాలని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని నల్లమడ రైతుసంఘం నేత డాక్టర్ కొల్లా రాజమోహన్, పలువురు నేతలు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని రైతులు సాగునీరు, తాగు నీరు కోసం 85 సంవత్సరాలుగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని పోరాడుతున్నారని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగింపు ద్వారా పర్చూరు, చిల కలూరిపేట, ఎడ్లపాడు, కాకుమాను, పెద నందిపాడు, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని 49 గ్రామాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభిస్తాయ న్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల వాగ్దానాలు, అసెంబ్లీ ప్రకటనలు ఆచరణకు నోచుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 2023 జూన్ 28 నుండి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆఫీసు ఎదురుగా వందలాది మంది రైతులు 20 రోజులకుపైగా నిరసన దీక్ష చేశారన్నారు. ఆ సందర్భంలో రాష్ట్ర నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. 21వ రోజున ▶ 2లో

కారుమంచి కాలువను

పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి

- రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు డిమాండ్
- కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు బ్రాంచి కెనాల్‌పై ఉన్న కారు మంచి మేజర్ కాలువకు రిటైనింగ్ గోడ కట్టి.. పూర్తిస్థాయిలో పునరుద్ధరించి కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట రావు డిమాండ్ చేశారు. కారుమంచి కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సోమ వారం కలెక్టరేట్ వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సమిడి వెంకటరావు మాట్లాడుతూ కారుమంచి మేజర్ కాలువ కట్ట మధుకాన్ గ్రానైట్ క్వారీలోకి జారి పోయి మూడేళ్లుఅవుతున్నా నేటికి పూర్తి చేయకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. ఈ కాలువ కింద 17 పంచా యతీల పరిధిలో 25 వేల ఎకరాలు సాగవు తుందని తెలిపారు. కాలువ దెబ్బతినటంతో ఈ పరిధిలోని పంట చెరువుల కింద సాగు ఆగిపోయిందన్నారు. పొగాకు, మిర్చి రైతులకు సకాలంలో నీరు అందటం లేదన్నారు. అప్పటినుంచి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తుందని, ఇది ఏమాత్రం చాలదన్నారు. క్వారీ కింద నుంచి రిటైనింగ్ వాల్ కట్టి కాలువ కట్టను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయటంతో ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ధర్నా అనంతరం మీకోసం కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జెసి ఈ విషయమై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, కె.చిన్నపు రెడ్డి, కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య పాల్గొన్నారు.

నీ అక్రమాలపై పోరాడతా..

(మొదటిపేజీ తరువాయి)

వారు ఇప్పుడు మీ పార్టీలో ఉన్నారని పేర్కొన్నారు. తాను ఏ వ్యాపారినీ బెదిరించి అవినీతికి పాల్పడలేదని, తాను ఎవరినైనా బెదరించినట్లు ఆధారాలు ఉంటే రుజువు చేయాలని చెప్పారు. తాను 25 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నానని, ఏనాడూ ఏ బిల్డర్‌నూ, ఏ వెంచర్ వేసిన వారినీ బెదిరించింది లేదన్నారు. ఇప్పుడు మీరు వచ్చి రాగానే 150 మందికి నోటీసులు పంపారని, వాళ్లందరి వద్ద నుంచి డబ్బులు దండుకోవాలన్నది మీ ఆలోచన అని ఆరోపించారు. కొత్తపట్నం మండలం, రాజుపాలెం వద్ద 100 ఎకరాల ప్రభుత్వ భూమిని దామచర్ల జనార్ధన్ ఆక్రమించారని, ఆధారాలతో సహా రుజువు చేస్తానని చెప్పాడు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఎవరిని ఇబ్బంది పెట్టలేదని, ఇప్పుడు మీరు తమ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారని, కేసులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని చెప్పారు. గతంలో తాము కూడా ఇలాగే చేస్తే మీ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాజకీయాలు తాను వద్దనుకున్న సమయంలో తమ కార్యకర్తలపై దాడులు చేసి తనను తిరిగి తీసుకొచ్చి రాజకీయం మీరే చేయిస్తున్నారని పేర్కొన్నారు. తాను ఎక్కడికీ వెళ్లేది లేదని, ఒంగోలులోనే ఉంటానని, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. తనను నమ్ముకున్న వారికి న్యాయం చేస్తానన్నారు. తాను జనసేనలోకి వెళుతున్నానని ప్రచారం చేస్తున్నారని,. అందులో వాస్తవం లేదన్నారు. రెండు నెలలు సమయం కావాలని, చిన్నచిన్న అప్పులు ఉన్నాయని, అవి తీర్చుకొని మరలా ఒంగోలు వస్తానని చెప్పారు. ఇక్కడే అందుబాటులో ఉంటానని బాలినేని స్పష్టం చేశారు.

దమ్ముంటే నా మీదకు రండి..

కార్యకర్తల మీద దెబ్బపడితే అది తన మీద పడ్డట్టేనని బాలినేని స్పష్టం చేశారు. దమ్ముంటే తన మీదకు రావాలని సవాల్ విసిరారు. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. బ్రాహ్మణుల స్థలం విషయంలో తన మీద ఆరోపణలు చేశారని, ఆ వివాదంలో ఉన్న వ్యక్తి కూడా ఇప్పుడు మీ పార్టీలోనే ఉన్నారని బాలినేని వ్యాఖ్యానించారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి భూ కబ్జాలకు సపోర్టు చేశానన్నారని, ఆయన కూడా ఇప్పుడు మీ పార్టీలోనే ఉన్నారని చెప్పారు. తప్పుడు పనులు మీరు చేస్తూ .. తమపై ఆరోపణలు చేస్తారా..? అని నిలదీశారు. కొన్ని చోట్ల వైఎస్‌ఆర్ విగ్రహాలను టిడిపి నేతలు పగలకొట్టడాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి తప్పుపట్టారు. వైఎస్‌ఆర్, ఎన్‌టిఆర్‌లు మహానుభావులని వ్యాఖ్యానించారు. ఏనాడైనా తాము ఎన్‌టిఆర్ విగ్రహాల జోలికిపోయామా..? అని నిలదీశారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్‌లు కట్టుకునే వారి వద్ద నుంచి డబ్బులు గుంజుకునే ప్రయత్నాలు అప్పుడే మొదలుపెట్టారని విమర్శించారు. తాను ఎక్కడికీ పారిపోనని, వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేస్తానని, అవినీతి జరిగితే ప్రజాపోరాటం చేస్తానని బాలినేని స్పష్టం చేశారు. అప్పట్లో జగన్‌మోహన్‌రెడ్డిని జైలులో వేసినప్పుడు సిబిఐ అధికారులు తనను కూడా జైలులో వేయాలని చూశారని, అయితే తన మీద చిన్న కాగితం కూడా వారికి చిక్కలేదని బాలినేని చెప్పారు. మంత్రిగా పలు పర్యాయాలు పనిచేసినా ఎక్కడా తనమీద అవినీతి ఆరోపణలు లేవన్నారు. తనమీద వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా ఏమీ గొడ్డు పోలేదు..

వైసిపి జిల్లా అధ్యక్షుడి మార్పు విషయంపై జరుగుతున్న ప్రచారం గురించి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. ప్రకాశం జిల్లా ఏమీ గొడ్డుపోలేదన్నారు. జిల్లా నాయకులలో ఎవరైనా జిల్లా అధ్యక్షుడిగా ఉంటే బాగుంటుందనేది కార్యకర్తల మనోభావమన్నారు. అదే తన మనోభావం అని కూడా బాలినేని స్పష్టం చేశారు. తాను జిల్లాలో కార్యకర్తలకోసం ఆలోచిస్తానని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

బాలినేని విల్లాస్‌పై ఇంటెలిజన్స్ అధికారులతో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఒంగోలు తెలుగుదేశం పార్టీ టికెట్‌ను చంద్రబాబును అడిగారని, ఆయన ఇవ్వనని చెప్పటంతో ఆగారన్నారు. ఇటీవల జనసేన పార్టీలోకి వెళుతున్నట్లు చెప్పి ఇప్పుడు ఏదో మాట్లాడుతున్నాడని విమర్శించారు. గతంలో ఒంగోలు నియోజకవర్గానికి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసింది శూన్యమని, ఒంగోలులో గంజాయి బ్యాచ్ సంగతి తెలుస్తామన్నారు. బాలినేని ఇంట్లో పనిచేసే వారికి కార్పొరేషన్ నుంచి జీతాలు ఇచ్చారని, కార్పొరేషన్ వాళ్ళ సొంత ఆస్తి కాదని తెలియజేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి లేనిపోని ఆరోపణలు చేయటం మానుకోకపోతే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సింగరాజు రాంబాబు, ఎద్దు శశికాంత్ భూషణ్ పాల్గొన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లిలో మొహరం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గత కొన్ని రోజులుగా మొహరం సందర్భంగా వివిధ రూపాలలో ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిగుండం ద్వారా తమ భక్తిని చాటుకున్నారు. ప్రతి ఏడాది ఈ మొహరం పండుగను హిందూ, ముస్లింలు కుల మత బేధాలు లేకుండా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది గ్రామస్తుల సహకారంతో పీర్ల చావిడి కట్టించినట్లు చెప్పారు.

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిరసన దీక్షా శిబిరాన్ని పోలీసులు ఆక్రమించి నిరసన దీక్షను భగ్నం చేశారని, 29 మంది రైతులపై పోలీసులు కేసులు పెట్టారని చెప్పారు. అందులో 16 మంది మహిళా రైతులపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న 29 మంది రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి, అవసరమయిన చర్యలన్నింటినీ కాలపరిమితితో కూడిన ప్రణాళికతో పూర్తి చేసి నీరందించే చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. తరచూ నల్లమడ వరదల వల్ల పంట పొలాలు ముంపునకు గురవుతున్న ఈ ప్రాంతానికి శాశ్వత వరద నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాకుమానులో, నల్లమడ వరద నివారణకు నిధులు కేటాయిస్తున్నామని ప్రకటించారని, ఈ మేరకు సదరు హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు కె.విజయకుమార్, కొల్లా రామన్, ఎం.విజేత, ఎల్.చౌడేశ్వరి, ఇ.బ్రమరాంబ, డి.హరిబాబు నాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మిర్చి రైతులను ఆదుకోవాల రైతు సంఘం యోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మన్నె సాంబశివరావు, బాణాల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఖరీఫ్‌లో విస్తారంగా రైతులు మిర్చి పంట పండించి గుంటూరు మిర్చి యార్డులో గిట్టుబాటు ధర లేకపోవడంతో చాలామంది రైతులు గుంటూరులోనే కాకండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలోని శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, ఆవుల యోగయ్య, లక్ష్మయ్య, బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చమన్ 68వ జయంతి

ప్రజాశక్తి-మార్కాపురం

టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నూర్‌బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూదేకుల మస్తానయ్య ఆధ్వర్యంలో దూదేకుల ముద్దుబిడ్డ చమన్ 68వ జయంతి వేడుకలు స్థానిక ఎబిఎం కాంపౌండులోని ఆయన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చమన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న బాధితులు

'సహారా ఇండియా' నగదు ఇప్పించాలి

సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు బాధితుల వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

'సహారా ఇండియా' పరివార్ ఫీల్డ్ కార్యకర్తలకు చెల్లించాల్సిన పైకం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు సోమవారం గ్రీవెన్స్‌లో బాధితులు విజ్ఞప్తి చేశారు. సహారా ఇండియా రీఫండ్ పోర్టల్ సిఆర్‌సిఎస్ ద్వారా లేదా సహారా ఇండియా బ్రాంచీల ద్వారా పేమెంట్ ఇప్పించాలని కోరారు. సెబి-సహారా వివాదం కారణంగా సహారా ఖాతాదారులకు పేమెంట్లు నిలిచిపోయినట్లు చెప్పారు. ఖాతాదారులకు త్వరగా నగదు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



కలెక్టరు తమీమ్ అన్సారియాను కలిసిన ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బిఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయాని వారి ఆఫీస్‌లో సోమవారం సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నియోజకవర్గంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు, కారుమంచి కాలువలు తదితర పలు సమస్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు. వాటి గురించి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

మోటార్ సైకిల్ దొంగ పట్టివేత

5 మోటారు బైక్‌లు స్వాధీనం: సిఐ మల్లికార్జునరావు

ప్రజాశక్తి-పొదిలి

ప్రకాశం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, దర్శి డిఎస్‌పి పర్యవేక్షణలో, పొదిలి సిఐ సూచనలతో పొదిలి పట్టణంలో ఈ మధ్యకాలంలో దొంగిలించబడిన బైకులపై నమోదైన కేసుల గురించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుల కోసం వెతుకుతున్న క్రమంలో సోమవారం పొదిలి పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన సయ్యద్ ఖాదర్ బాషా అనే వ్యక్తి వద్ద నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ వద్ద గల మూతబడిన విజేత స్కూల్ ముందు చిల్లచెట్లలో ఉన్న ఐదు బైకులను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఐదు బైకులలో పొదిలి పట్టణానికి చెందిన నాలుగు మరియు దర్శి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఒకటి రికవరీ చేసినట్లు తెలిపారు. ఇందులో హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ 2 బైకులు, హీరో ఫ్యాషన్ ప్రో 2 బైకులు, దర్శి పోలీస్ స్టేషన్‌కు చెందిన గ్లామర్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రికవరీ చేసిన ఐదు బైకులు విలువ సుమారు రెండు లక్షల 38 వేల రూపాయలుగా ఉంటుందన్నారు. నేరస్తుడు చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందుల వలన జన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ మల్లికార్జునరావు

సంచారం లేని ప్రాంతాల్లో పార్కు చేసి ఉన్న బైకులను టార్గెట్ చేసి తన వద్ద ఉన్న నకిలీ తాళంతో స్టార్ట్ చేసి దొంగిలించేవాడన్నారు. కనుక పొదిలి మండలంలోని ప్రజలందరూ తమ వాహనాలను జాగ్రత్తగా భద్రపరచుకొని హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పాత బైకులకు లాక్ సిస్టంను ఎప్పటికప్పుడు మార్పు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎస్ఐ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఒత్తిడితో గృహిణి ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



ఆత్మహత్య చేసుకున్న గృహిణి సుజాత

వడ్డీ వ్యాపారుల ఒత్తిడితో గృహిణి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని వలపర్ల గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ అహ్మద్ బాషా, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వలపర్ల గ్రామంలో హైస్కూల్‌కు వెళ్లే రోడ్డులో నివాసం ఉండే తన్నీరు అంకమ్మరావు భార్య సుజాత స్థానికంగా టైలరింగ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. పెద్ద కుమారుడికి ఇటీవల ఆరోగ్యం బాగోలేకపోవడంతో కొంతమంది వడ్డీ వ్యాపారస్తుల దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకొని కుమారుడికి వైద్యం చేయించింది. ఈ క్రమంలో తీసుకున్న అప్పు చెల్లించమని వడ్డీ వ్యాపారస్తులు సుజాత ఇంటి వద్దకు వచ్చి ఒత్తిడి తేవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం కూడా అప్పు చెల్లించమని వడ్డీ వ్యాపారస్తులు అడగడంతో తీవ్ర ఆందోళనకు గురైన సుజాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న సమీప బంధువులు జరిగిన ఘటనను గమనించి అపస్మారక స్థితిలో ఉన్న సుజాతను ముందుగా స్థానిక ఆర్ఎంపి వైద్యుడి వద్ద చూపించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ అంబులెన్సులో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆలయ ఆదాయం రూ.1.68 లక్షలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి వారి ఆలయానికి ఆదివారం రూ.1,68,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జి నరసింహ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్లు అమ్మకం ద్వారా రూ.66,170, స్వామివారి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,290 స్వామి వారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాల ద్వారా రూ.72,240 వచ్చినట్లు చెప్పారు.

జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని

ఎమ్మెల్యేకు డిజిటల్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలో గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సాంకేతిక అర్హత కలిగిన డిజిటల్ అసిస్టెంట్లను వివిధ ప్రభుత్వ (ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ తదితర) శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. డిజిటల్ అసిస్టెంట్ల పదోన్నతి



ఎమ్మెల్యే బీఎన్‌ను శాలువాతో సత్కరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే బీఎన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులు కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని పామూరు సిఐ రామ్‌నాయక్ తెలిపారు. మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో దాతలు అందించిన ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మానం నాగేశ్వరరావు, రామిశెట్టి మల్లికార్జున, రామిశెట్టి మాలాద్రి, మానం గంగబాబునాయుడు తమ ఆర్థిక సహాయంతో అందించిన భోజనం ప్లేట్లు, వాటర్ బబుల్స్, స్టూల్‌లను పంపిణీ చేశారు. బోయళ్ల నారాయణరెడ్డి, అట్లూరి రామ్‌చంద్రరాజు, ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాలలో చదువుతున్న 160 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రేమతో దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.



పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పంచాయతీ కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట మేజర్ పంచాయతీలో కార్మికులకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బుద్ధుల ఆశ్రిత జ్యోతి, టిడిపి నాయకుడు బుద్ధుల ప్రేమానందంల ఆర్థిక సాయంతో 40 మంది కార్మికులకు రెండు జతలు యూనిఫామ్, రెండు టవళ్లు, ఒక జతచెప్పులు, కొబ్బరి నూనెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నరేంద్ర, సర్పంచ్ తండ్రి, టిడిపి నాయకుడు బుద్ధుల ప్రేమానందం, మండల టిడిపి అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, టిడిపి నాయకులు రాము, పంచాయతీ ఆఫీసు సిబ్బంది కృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహాశీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి డిప్యూటీ తహాశీల్దారు కిషోర్ కుమార్‌పై స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరిలో పేదల ఇళ్ల స్థలాలు ఆక్రమిస్తున్న ఆక్రమణదారులకు డిటి వంత పలుకుతూ పేదలిచ్చే ఫిర్యాదును కూడా స్వీకరించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని పేదలు కాయకష్టం చేసుకుని తమ బిడ్డల భవిష్యత్తు అవసరాల కోసం కనిగిరిలో స్థలాలు కొనుగోలు చేస్తే.. వీటిని అక్రమంగా గంటా ప్రకాష్ అనే వ్యక్తి ఆక్రమిస్తుంటే డిటి ఆక్రమణదారుడికి సపోర్ట్ చేశారని తెలిపారు. ఇలా పేదల స్థలాలను డిప్యూటీ తహాశీల్దారు సహాయంతో సపోర్టుతో ఆక్రమించాడని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుండా ప్రత్యక్షంగా సపోర్ట్ చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపి డిప్యూటీ తహాశీల్దారుపై పాలనాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. గంటా ప్రకాష్ యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేసుకుని నిరుద్యోగులను మోసం చేసిన విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా దామచర్ల జయంతి

ప్రజాశక్తి-పొదిలి



మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులుకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

మర్రిపూడిలో సోమవారం మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 95వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపూడి బస్టాండ్ సెంటర్‌లోని దామచర్ల ఆంజనేయులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాలకు మండల టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు రేగుల వీరనారాయణ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటరెడ్డి, టిడిపి నాయకులు చేరెడ్డి నరసారెడ్డి, బీసీ నాయకులు కొనిదెన మోహన్‌రావు, చిలంకూర్ శ్రీను, అంకేపల్లి రమణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, ఎస్సీ నాయకులు గురిజాల రాజేష్, గురిజాల రాజు, గురిజాల కాటయ్య, రమణయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

అంధకారంలో కొనకనమిట్ల ఎస్సీ కాలనీలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎస్సీ కాలనీల్లో అంధకారం నెలకొంది. వీధిలైట్లు మరమ్మతులకు గురికావడంతో వెలుగుకు నోచుకోలేదు. కాలనీల చుట్టూ పొలాలు ఉండటంతో రాత్రి సమయాలలో విషసర్పాల బెడదతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. బస్టాండ్ నుంచి బస్సు దిగి రావాలన్నా.. వెళ్లాలన్నా నానా తిప్పలు పడాల్సిందేనని వారు అంటున్నారు. గత రెండు రోజుల నుంచి చినుకులు పడటంతో రాత్రి సమయాలలో విషసర్పాల బెడద ఎక్కువగా ఉందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలలో మరమ్మతులకు గురైన వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టి కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


పంచాయితీ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్న సర్పంచి టి కృష్ణమోహన్

పంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీ నూతన భవనానికి జాతి ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించాలని సోమవారం స్పందనలో కలెక్టర్ వెంకట మురళిని సర్పంచ్ టి కృష్ణమోహన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40ఏళ్ల క్రితం నిర్మించిన తోకలవానిపాలెం పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉందని, గత మూడేళ్ల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకుండా ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం వర్షం పడితే పెచ్చులు ఊడిపోతున్నాయని, వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని అన్నారు. గ్రామంలో పేదలు, దళితులు ఉన్నత మ పంచాయతీకి వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉన్నందున ఎలాంటి పనులు చేయలేకపోతున్నామని వివరించారు. అందువలన ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించి నూతన భవనం నిర్మాణానికి సహకరించాలని కోరారు.


ఈత పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఈత పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - బాపట్ల

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జరిగిన జాతీయ స్థాయి 50వ జూనియర్ వాటర్ పోలో (ఈత పోటీల్లో) పోటీల్లో బాపట్ల విద్యార్థులు స్విమ్మర్ పతకాలు సాధించినట్లు స్విమ్మింగ్ జిల్లా కార్యదర్శి మంతెన నాగమురళి తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈత పోటీలల్లో రాష్ట్రం తరపున సిమ్మర్లు బేతాళం హర్షవర్ధన్ రాజు, మంతెన నాగ శ్రీ రోహన్, భూపతిరాజు శ్రీదీక్ష జాతీయ పథకాలు సాధించారని తెలిపారు. కర్నూలులో జరిగిన అంతర్ జిల్లాల 9వ రాష్ట్రస్థాయి జూనియర్ ,సబ్ జూనియర్ ఆక్వాటిక్ 5 ఛాంపియన్షిప్ ఈత పోటీల్లో బాపట్ల ఈతగాళ్లు పది స్వర్ణ, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన వారిలో గ్రూప్- 2 ఈత పోటీల విభాగంలో సిహెచ్ అవిఘ్న 200 బ్యాక్ స్ట్రోక్, 100 బ్యాక్ స్ట్రోక్, 50బ్యాక్ స్ట్రోక్, 100 ఫ్రీ స్టైల్, 50 ఫ్రీ స్టైల్‌లో మొదటి స్థానం సాధించి ఐదు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. గ్రూప్2 విభాగంలో కె లాసశ్రీ 800 ఫ్రీ స్టైల్, 400 ఫ్రీ స్టైల్, 400ఐఎం, 200 ఐఎంలో నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. గ్రూప్1 విభాగంలో బేతాళం హర్షవర్ధన్ రాజు 1500 ఫ్రీ స్టైల్, 200 బ్యాక్ స్ట్రోక్ ,100 బ్యాక్ స్ట్రోక్‌లో మూడు కాంస్య పతకాలు సాధించి ఈత పోటీల్లో బాపట్ల సిమ్మర్లు పతకాల పంట పండించారని అన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన స్విమ్మర్లను కార్యదర్శి మంతెన నాగమురళి, కోచ్ జి సురేష్, ఖాజాలను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి - పర్చూరు

చెరుకూరు ఎకెఎంఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల యాజమాన్యం తనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసినట్లు పాఠశాల గణితం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న చీతిరాల వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో యజమాన్యంపై అసత్య ఆరోపణలు చేసి బహిష్కరణకు గురైనట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం క్షమించి తనను మళ్ళీ విధుల్లోకి తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కార్మిక నేత కామ్రేడ్ 'పర్స'కు నివాళి

ప్రజాశక్తి - చీరాల


పుస్తకం ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ అండగా నిలిచిన కార్మిక నేత కామ్రేడ్ పర్స సత్యనారాయణని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. ఆయన శత జయంతి సందర్భంగా పట్టణంలోని ఐఎట్‌టిడి కంపెనీ ఫెడరేషన్ కార్యాలయంలో జయంతి సభ సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఫెడరేషన్ నాయకులు పూలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతు కామ్రేడ్ పర్స సత్యనారాయణ వ్యక్తిగతంగా అత్యంత నిడారంబరంగా గడిపారని అన్నారు. ఎంఎల్ఎగా పనిచేసిన, ఉన్నత స్థాయిలో ఉన్న ఒక సెంటు భూమి, చిన్న ఇల్లు సంపాదించుకోలేదని అన్నారు. కార్మిక నేతలు అనుసరించాల్సిన నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అన్నారు. 32ఏళ్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడిగా, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షుడిగా పనిచేశారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారని అన్నారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ధన్యజీవి అన్నారు. అనంతరం కామ్రేడ్ పర్స సత్యనారాయణ జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మంజుందర్, చీరాల అధ్యక్షులు ఎన్ బాబురావు, కార్యదర్శి ఎం వసంతరావు, ఐఎట్‌టిడి ఫెడరేషన్ నాయకులు బి పోతురాజు, కె సుధీర్, సాంబశివరావు, బి శ్రీనివాసరావు, సత్యమూర్తి, హరిప్రసాద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - బాపట్ల

పర్చూరు మండలం నూతలపాడులో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు బాడుగుల నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు సంఘం నాయకులతో కలిసి కౌలు రైతు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు మూడేళ్ళుగా 16 ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేసి రూ.45 లక్షల వరకు నష్టపోయి అప్పులు పాలయ్యాడని తెలిపారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆ కుటుంబానికి రూ.25లక్షలు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో పిల్లల చదువులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న రుణం పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు టి రామారావు, చేతి వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పి కొండయ్య, బుల్లియ్య, అద్దంకి రామ సుబ్బారావు పాల్గొన్నారు.

పెన్సిళ్లపై నెల్సన్ మండేలా జీవిత చరిత్ర

విద్యార్థి మహిత నైపుణ్యంపై పలువురు హర్షం

ప్రజాశక్తి - చీరాల

సూక్ష్మ కళాకారిణి అన్నం మహిత పెన్సిళ్లపై ప్రముఖుల జీవిత చరిత్రలను చెక్కి అందరి మనన్నలు పొందినది. భారతరత్న, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా కాంతి కిరణం నెల్సన్ మండేలా జీవిత చరిత్ను పెన్సిళ్లపై చెక్కి అందరినీ అబ్బురపర్చారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం నరసింహారావు, భ్రమరాంబ దంపతుల కుమార్తె మహిత గతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ వంటి జాతీయ నేతలతోపాటు రజినీకాంత్, వైఎస్ఆర్, తమిళనాడు సిఎం స్టాలిన్ వంటి సినీ, రాజకీయ నాయకులు, ప్రముఖుల జీవిత చరిత్రలను పెన్సిళ్లపై చెక్కి అందరి మన్ననలు పొందారు. ఈ నెల 18న నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా కేవలం 20రోజుల్లో 93పెన్సిళ్లపై మండేలా జీవిత చరిత్రను ఎక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఎవరైనా దాతలు ఆర్థిక సాయం అందిస్తే దక్షిణాఫ్రికాకు తన కళాఖండాన్ని అందిస్తామని కోరారు.


సూక్ష్మచిత్రకారిణి మహిత



నెల్సన్ మండేలా జీవిత చరిత్ర రాసిన పెన్సిళ్లు

విద్యార్థి ఫీజుకు రోటరీ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నుపాటి రామాంజనేయులు సౌజన్యంతో విశ్వ భారతి జూనియర్ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదువుతున్న సయ్యద్ అమీర్ అహ్మద్ కాలేజీ ఫీజు నిమిత్తం రూ.15వేల ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దాత చెన్నుపాటి రామాంజనేయులు మాట్లాడుతూ తాను చాలా పేదరికంలో నుండి వచ్చి చదువుకొని అభివృద్ధిలోకి వచ్చానని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. రోటరీ అధ్యక్షులు వీరయ్య మాట్లాడుతూ రామాంజనేయులు గతంలో ఎన్నో గుప్త దానాలు చేశారని అన్నారు. రోటరీ క్లబ్ తరపున సహాయం అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రోటరీ కార్యదర్శి మురళీ సుధాకరరావు మాట్లాడుతూ 135ఏళ్ల నుండి రోటరీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవలు చేస్తున్నదని అన్నారు. దివాకరదత్తు మాట్లాడుతూ పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకొని క్రమశిక్షణతో చదివే లక్ష్యంగా చేసుకొని వృద్ధిలోకి రావాలని కోరారు. మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ పేదరికం పోవాలంటే చదువే ఆయుధమని అన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో చదివి వృద్ధిలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, చెన్నుపల్లి నాగేశ్వరావు పాల్గొన్నారు.


రోటరీ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్మల్ కుమార్

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన నిర్మల్ కుమార్ జిల్లా కలెక్టర్ వెంకట మురళిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అదే విధంగా డిఆర్ఓ సత్తిబాబు, ఆర్డీఓ గంధం రవీందర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - చీరాల

వాతావరణ మార్పుల వలన సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టితో విధులు నిర్వహించాలని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆర్అండ్‌బి, డ్రైనేజీ డిఇ, చీరాల, వేటపాలెం ఎంపీడీఒ, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్యం ఎప్పటికప్పుడు చేయాలని చెప్పారు. ప్రజలు అనారోగ్య బారిన పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు అవసరమైన పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థి ప్రతినిధులు

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లిలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న 50మంది విద్యార్థులకు పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేటపాలెం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు బట్ట మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించి బాగా చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇష్టంగా కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత భవిష్యత్తు అందుకోవచ్చని చెప్పారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం కార్యదర్శి దశరథరామిరెడ్డి, పృథ్వీ రాజు, పృథివి వీరాంజనేయులు, రామబ్రహ్మం, పోలకం బాలాజీ, పాఠశాల హెచ్ఎం ఎస్‌వి లక్ష్మి, బాజీ వలి, ఉపాధ్యాయులు పల్లవి శ్రీమన్నారాయణ, ప్రసాద్, గాయత్రి పాల్గొన్నారు.


సర్పంచిని అవమానపరిచిన..

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎరుకుల హక్కులపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. మోహన్ కుమార్ ధర్మా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామ సర్పంచిని కులం పేరుతో దూషించి అవమానపరిచిన పంచాయతీ కార్యదర్శి హరిబాబుపై చర్యలు తీసుకోవాలని ఎరుకుల హక్కులపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. మోహన్ కుమార్ ధర్మా డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచి, కార్యదర్శి సమన్వయంతో మెలిగి గ్రామాభివద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిఉందన్నారు. అలా కాకుండా సర్పంచితో పనిలేకుండా కార్యదర్శి తన ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరించడం సరైన పద్దతి కాదన్నారు. చేసిన పనులకు బిల్లులు చేయకుండా సర్పంచిని కులం పేరుతో దూషించడం, అవమానపరచడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఈనెల 9న ఫిర్యాదు చేసిన నేటికీ కార్యదర్శి హరిబాబుపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు చేసినపనులకు బిల్లులు చేయకుండా సర్పంచితో ప్రమేయం లేకుండా తనఇష్టానుసారంగా వ్యవహరిస్తూ గ్రామాభివద్ధికి ఆటంకం కలిగిస్తున్న కార్యదర్శి హరిబాబుకు సహకరిస్తూ సర్పంచిని అవమానపరిచిన ఇద్దరు వార్డు మెంబర్లపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచి ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే చులకన భావం చూపిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కార్యదర్శి, అతనికి సహకరిస్తున్న ఇద్దరు వార్డు మెంబర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమం ఉధీతం చేస్తామని హెచ్చరించారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకుడు పాలపర్తి యానాది మాట్లాడుతూ గ్రామంలో ఎన్నికల సందర్భంలో తప్పా, అనంతరం కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి మెలసి జీవిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి హరిబాబు వచ్చిన తరువాత అలాంటి ప్రశాంతకరమైన గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివద్ధికి ఆటంకం కలిగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఐక్యంగా రాజకీయాలకు అతీతంగా గ్రామాభివద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ పోతురాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దేవరకొండ జయమ్మ, ఎరుకుల హక్కుల పోరాట సమితి లీగల్ అడ్వైజర్ ప్రతాప్, కోకన్వీనర్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న మోహన్ కుమార్ ధర్మా

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి చదువుతున్న కళాశాలకు, తలి దండ్రులకు మంచి పేరు తీసురావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టెస్టు బుక్‌లు దామచర్ల సత్య చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ గత సంవత్సరం ఈ కళాశాల విద్యార్థి స్టేట్ 3వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. బాగా చదివి ఈ సంవత్సరం స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించేలా ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు. కళాశాలకు 8 మంది ఐఎఫ్ ప్యానల్ (టివిలు) మంజూరైనట్లు తెలిపారు. విద్యార్థులు వాటిని బాగా ఉపయోగించుకొని అధ్యాపకులు చేప్పే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. అనంతరం స్కిల్ హబ్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సత్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, టిడిపి మండల అధ్యక్షడు బి.యలమంద నాయుడు, బత్తుల నారాయణస్వామి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యం.వెంకటేశ్వర్లు , కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న దామచర్ల సత్య



కేక్ కట్ చేస్తున్న బ్యాంకు మేనేజర్

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ విక్రమతేజ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు శింగరాయకొండ బ్రాంచి మేనేజర్ ఎస్.విక్రమతేజ తెలిపారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లో ఖాతాదారుల సమావేశం సోమవారం నిర్వహించారు. బ్యాంకు ఏర్పాటు చేసి 22 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విక్రమతేజ మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సామాన్య ప్రజలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఫిక్స్‌డ్ డిపాజిట్ లపై 0.5 శాతం వడ్డీ అదనంగా ఇస్తుదన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత విద్యాశాఖ అధికారులు కోటపాటి నారాయణ, ఎం.నరసింహారావు, ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జిల్లాకే తలమానికంగా

దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల


- అందుబాటులో 10 కోర్సులు
- గతేడాది ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-దర్శి

దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని ఏ కళాశాలలో లేని విధంగా అత్యధిక కోర్సులు ఉన్నాయి. గత ఏడాది ఈ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ సముద్రాల వెంకటసుబ్బారావు తెలిపారు. 10 కోర్సులు తమ కళాశాలలో అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. అన్ని కోర్సుల్లోనూ విద్యార్థులు అత్యధి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసి, ఒఎ, సెరికల్చర్, సిఎస్‌ఇ, ఎల్‌ఎం అండ్ డి, ఎంపిహెచ్‌డబ్ల్యు (నర్సింగ్)ఎంఎల్‌టి కోర్సులు అందు బాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో టినే 715 /1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపిసిలో జి.సుమిత 915/1000, సిసిలో ఏ.బాబు 785/1000, హెచ్‌ఇసిలో బి.గోపి 51/1000, ఒఎల7 ఎం.మహేశ్వరిబాయ్ 925/1000, సెరికల్చర్‌లో పి.కవిత 951/1000, సిఎస్‌ఇలో జి.డేవిడ్ రాజు 971/1000, ఎల్‌ఎం అండ్ డిలో ఎస్.కె అఫ్రాజా 913/1000, ఎంపిహెచ్‌డబ్ల్యు (నర్సింగ్)లో టి.శ్రీజ 960/1000, ఎంఎల్‌టిలో వెంకటచందు 896/1000 సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. పై కోర్సుల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలలో ఆడ్మిషన్ పొందవచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇదే



చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

చిన్నారులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి -మద్దిపాడు

మద్దిపాడుకు చెందిన కాకుమాను కోటేశ్వరరావు కుమార్తె ఓణిల వేడుక సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రమణ్యం, మాజీ సర్పంచి ఉప్పుగుండూరి నాగేశ్వరావు,గ్రామ అధ్యక్షుడు రఘు, రంపతోటి అంకారావు, నువ్వల శివ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్ర బృందంతో నున్నా బాలసుబ్రమణ్యం

మద్దిపాడు చేరిన పాదయాత్ర

ప్రజాశక్తి మద్దిపాడు

సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడంతో సత్తనపల్లి నియోజకవర్గానికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నాయకులు తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర సోమవారం నాటికి మద్దిపాడుకు చేరింది. పాదయాత్ర బందానికి జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రమణ్యం స్వాగతం పలికారు. ఒఆర్‌ఎస్‌ఎల్, మాజా ప్యాకెట్లు అందజేశారు. అదేవిధంగా దారి ఖర్చుల నిమిత్తం రూ.4 వేల నగదను అందజేశారు. పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని నున్నా ఆకాంక్షించారు. ఈ పాదయాత్రలో కేదారి రమేష్, రుసుం వెంకటేశ్వర్లు, ఏపూరి వెంకటేశ్వర్లు, తోట పుల్లారావు, తోట నరసయ్య, తోట వెంకటశివరావు, తోట వెంకటేశ్వర్లు ఉన్నారు.

చీమకుర్తి సిఐగా సుబ్బారావు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి సిఐగా ఎం. సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సిఐగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌ను గత నెల 28న ఎస్‌పి సెస్పండ్ చేశారు. ఆయన స్థానంలో సిఐగా సుబ్బారావు బాధ్యతలు చేపట్టారు.



సుబ్బారావు

యువజన నైపుణ్య దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలనే ఆకాంక్షతో యువత ముందుకు సాగాలన్నారు. ఆదిశగా లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. యోగా ప్రాముఖ్యత గురించి విద్యార్థుల చేత యోగాసనాలు చేయించారు. అనంతరం స్కిల్ హబ్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ విజయకుమారి, డేటా ఎంట్రీ శిక్షకుడు ఉమా మహేష్, సోలార్ ఎనర్జీ శిక్షకుడు షేక్ తానీషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి • వినూత్నంగా కనిగిరి మున్సిపాలిటీ ఒకటో వార్డులో 'మీతో మీ ఎమ్మెల్యే' కార్యక్రమం

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ ఒకటో వార్డు పరిధిలోని ఇందిరా కాలనీలో 'మీతో మీ ఎమ్మెల్యే' అనే వినూత్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం తెల్లవారుజామున 6 గంటలకు చేపట్టారు. వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి తెలుసుకుంటూ వార్డులో పర్యటించారు. ఎమ్మెల్యే వార్డు పర్యటనకు వచ్చిన కొంత సమయం తర్వాత మున్సిపల్ కమిషనర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. పారిశుధ్య నిర్వహణ సిబ్బంది సక్రమంగా రావడం లేదని, దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతూ మురుగు నీరు కాలువలపై పారుతూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని, నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఫలితంగా ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తమరు వస్తున్నారని ఈరోజు ప్రత్యేకంగా వార్డులో పారిశుధ్య పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కనిగిరి మున్సిపాలిటీ అయినప్పటికీ ప్రజల సమస్యలు తీర్చేలా చర్యలు చేపట్టలేకపోవడం ఏమిటని కమిషనర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనర్హులైన వారికి పెన్షన్లు, ప్రభుత్వ పథకాలను అందజేసిన అధికారులపై చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. గార్లపేట రోడ్డులో మూసివేసిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. సమస్యలు పరిష్కరించుకోవాలి కానీ వసతి గృహాన్ని మూసివేయడం సరికాదన్నారు. పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే వసతి గృహాన్ని నిర్వహించాలని సూచించారు. ఎంఎస్ఎం కళాశాల సమీపంలోని చెత్త డంపింగ్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి ఆ ప్రదేశంలో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే వార్డులలో పర్యటించేందుకు తాను వచ్చినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, కనిగిరిని కనకగిరిగా మార్చుతానని, అభివృద్ధిలో భాగస్వాములై సహకరించాలని ప్రజలకు సూచించారు. ఐదు సంవత్సరాలలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేస్తేనే తిరిగి ఆదరించి గెలిపించాలని, లేకపోతే ఇంటికి పంపించాలని ప్రజలకు తెలియజేశారు. కాగా 20 వార్డుల నుంచి సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని ఆయన మెప్పు పొందేందుకు హడావుడి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న వార్డు ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

బేస్తవారిపేటను అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేగినాటి ఓసురారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గిద్దలూరు శాసనసభ్యులు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి బి వెంకటరాజు, ఎంపీడీవో టీ పార్వతి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

15 సెల్‌ఫోన్లు రికవరీ: ఎస్ఐ కోటయ్య

ప్రజాశక్తి-పొదిలి


బాధితుడికి సెల్ ఫోన్ అందిస్తున్న ఎస్ఐ

ప్రకాశం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు దర్శి డీఎస్పీ సూచనలతో పొదిలి సిఐ సలహాలతో మొబైల్ ఫోన్‌ల దొంగతనాలపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గత వారం రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి మొత్తం 15 ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. సోమవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫోన్‌లు పోగొట్టుకుని రికవరీ అయిన వాటిని బాధితులకు అందజేశారు. ఈ ప్రత్యేక బృందంలో పాల్గొని రికవరీ చేసిన పోలీసులను వారు అభినందించారు.

నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-దర్శి

ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా సోమవారం కార్యక్రమాన్ని దర్శి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాలలో స్కిల్‌హబ్ అందిస్తున్న కోర్సులను నేర్చుకోవడం వల్ల విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని అధ్యాపకులు కె ప్రభుదాస్, జి వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం రామచంద్రయ్య, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ ఎస్ రమేష్, ల్యాబ్ అసిస్టెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చాయి. తహశీల్దారు ఎస్‌కే మీరావలి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రెండు అర్జీలు సర్వే కొలతలకు, ఒకటి పట్టాదార్ పాస్ పుస్తకానికి దాఖలయ్యాయిని తహశీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం శ్రీహరి, ఎంఈఓ డి వెంకారెడ్డి, వెలుగు ఎపిఎం సుధాకర్ రావు, హౌసింగ్ ఏఈ ఎం వెంకటస్వామి, పంచాయతీరాజ్ ఏఈ పి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సిఐటియు శిక్షణా తరగతులు

జయప్రదం చేయండి: ఎం రమేష్

ప్రజాశక్తి-పొదిలి

ఈ నెల 17,18 తేదీల్లో పొదిలిలో జరిగే సిఐటియు జిల్లా నాయకత్వ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ తన కార్పొరేట్ ప్రభుభక్తిని విడనాడలేదని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పిఎఫ్ సకాలంలో చెల్లించని యజమానులపై విధించే పెనాల్టీని 25శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందన్నారు. నూతన వ్యవసాయ చట్టాలతో రైతులను వ్యవసాయం నుంచి గెంటివేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులను కోతపెట్టి నిర్వీర్యం చేయడం ఈ ప్రభుత్వ పాలసీగా ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచి ప్రజలపై పెను భారాలు మోపుతోందన్నారు. ప్రజల సంపద, హక్కుల పరిరక్షణ కోసం ఈ భారాల పెంపునకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. ఈ విపత్కర పరిస్థితులలో విశాలమైన ఐక్య ఉద్యమాల ద్వారానే ఈ దాడిని తిప్పికొట్టడానికి సిఐటియు ప్రయత్నిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కార్మిక ఉద్యమాలపై గత వైసిపి ప్రభుత్వ చేపట్టిన నిర్బంధాలను అధిగమించి అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమరశీల పోరాటాల నిర్వహించి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడంలో సిఐటియు కృషి మరువలేనిదన్నారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం చిరు ఉద్యోగులపై ఉక్కుపాదం మోపుతూ ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తోందన్నారు. నేడు కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించి పరిష్కారానికి బలమైన ఉద్యమాన్ని నిర్మించేందుకు జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులలో జిల్లాలోని అన్ని మండలాలు, రంగాల నుంచి సిఐటియు నాయకత్వం పాల్గొంటారని తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి: కమిషనర్

ప్రజాశక్తి-పొదిలి


నీళ్ల ట్యాంకర్లను ప్రారంభిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

పొదిలి నగర పంచాయతీలో నీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తానని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పొదిలి నగర పంచాయతీలోని కాటూరి వారిపాలెం గ్రామంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటి ఎద్దడి లేకుండా టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకర్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పొదిలి నగర పంచాయతీలో ప్రజలందరికీ ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఆందరికీ అందుబాటులో ఉంటానని, ప్రధానంగా నీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ సిటిజన్ మాకినేని వెంకట రమణయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె రసూల్, మాజీ సర్పంచ్ కాటూరి చిన్న నారాయణరావు, ఎస్‌కె జిలాశ్రీతీ, కాటూరి శ్రీను, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి


ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-2 ను మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఆరోగ్య కేంద్రం భవన యజమానికి ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, సుమారు వారం నుంచి నీటి ఇబ్బందితో బాధపడుతున్నట్లు వైద్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి త్వరలో నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఛైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా నూతన భవన నిర్మాణం కోసం ఒక్కొక్క కేంద్రానికి 80 లక్షల రూపాయలు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయన్నారు. ఒక్కొక్క కేంద్రంలో ఏడుగురు ఉద్యోగులను నియమించి ఉన్నారని, వీరిలో అర్హత కలిగిన వైద్యులు, హెడ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర విభాగాల ఉద్యోగులు సేవలు అందిస్తారని తెలిపారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. అలాగే ఈ కేంద్రాల్లో చాలా రకాల రక్త పరీక్షలు కూడా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిర్వహిస్తున్నారని, వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రజలు అర్హత గల వైద్యుల వద్దకు వెళ్లకుండా ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చాలా మొత్తంలో డబ్బులు వృథా చేసుకుంటున్నారని, ఈ కేంద్రాల్లో వైద్యం పొందితే ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలను పేద ప్రజలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియర్షానంద, స్టాఫ్ నర్సులు మేరీ, దీపిక, స్థానిక నాయకులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపోలో రిలే దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి


రిలే దీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పొదిలి డిపోలో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా పలు దఫాలుగా కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై గేట్ మీటింగ్‌ల ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకుపోయి సమస్యలపై చర్చలు జరిగిన కూడా పరిష్కారం కానందున గత్యంతరం లేని స్థితిలో నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు నాయకులు తెలిపారు. తొలిరోజు రిలే నిరాహార దీక్షలలో ఎస్‌కె జిలాని, ఎస్‌కే బాబావలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ బాధ్యులు టి వెంకటేశ్వర్లు, ఎం షరీఫ్‌లు పూలమాలలు వేసి దీక్ష శిబిరం ప్రారంభించారు. నాయకులు ఎస్‌కే బాషా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

ప్రజాశక్తి

7

మంగళవారం 16 జులై 2024



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్ నాయక్

మోడల్ స్కూల్ విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులందరూ బదిలీపై వెళ్లగా నార్త్ ఇండియన్ ఉపాధ్యాయులు కొత్తగా రావడంతో ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు నిరసన చేపట్టారు. తమకు ఇప్పటి దాకా ఇంగ్లీష్‌లో చెప్పి తెలుగులో కూడా అర్థమయ్యేలా చెప్పేవారని, నార్త్ ఇండియన్ ఉపాధ్యాయులకు తెలుగు రాకపోవడంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఉపాధ్యాయులుగా తెలుగు రాష్ట్రాల వారిని కొనసాగించాని వారు కోరారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మస్తాన్ నాయక్ అక్కడకు చేరి విద్యార్థులతో మాట్లాడి సర్దిచెప్పడంతో విద్యార్థులు నిరసనను విరమించారు.



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసులు

కౌలు కార్డులతో ప్రయోజనం

మార్కాపురం ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

కౌలు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కౌలు రైతులందరూ తప్పక అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నికరంపల్లి, నాగులవరం, మాల్యవంతునిపాడు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నికరంపల్లి, నాగులవరం, మాల్యవంతునిపాడు గ్రామాల వీఆర్‌వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల...

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం



ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.ఆవులయ్య మాటాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు ప్రయోజనం కలిగించే విధంగా బోర్డు నిర్వహణ ఉండాలన్నారు. అందుకు భిన్నంగా జారీ చేసిన మెమో నెంబర్ 1214ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, క్లెయిమ్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం రఫి మాట్లాడుతూ టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగిస్తామని, ఉచిత ఇసుక ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. తీరా ఎన్నికల్లో ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాట మారుస్తున్నారని విమర్శించారు. సంక్షేమ బోర్డు కొనసాగించాలని పలువురు కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బి.రోశయ్య, ఎస్.కె ఖాజావలి, జెర్మియా, బి.నర్సింహులు, డి. థామస్, విన్ బాబు, షేక్ మహబూబ్‌బాషా, పి. వెంకటేశ్వర్లు, ఎం.చెన్నయ్య, ఎం.శ్రీను, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మండల పరిధిలోని మిట్టమీదపల్లి మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదివిన 6 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బి.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు సింగంశెట్టి ధీరజ్, కే. శేషు మని, ఎన్.ప్రేమ్ కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించగా మున్నంగి శిరీష, గోమసాని మాధవి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, దుక్కి కీర్తి రెడ్డి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం జరిగిందన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారు కూడా చదువులో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాల పరిధిలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ గిరిజన నాయకులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉండవల్లి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో గిరిజన నాయకులు చెవుల అంజయ్య, ఎం.చిన్న మంత్రూ నాయక్, నిమ్మల ఈదన్నలు కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జిటి, పివిటిజి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులకు డీఎస్సీ ద్వారా కాకుండా ఐటీడీఏ పీవోల ద్వారా పాత పద్ధతిలోనే భర్తీ చేయుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. గిరిజన గూడేలలో విద్య, వైద్యం, విద్యుత్, మంచినీళ్లు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. యర్రగొండపాలెంలో గిరిజన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఉచిత ఇసుక ప్రజలకు వరం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పథకం ప్రజలకు వరంలా మారిందని టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల అవసరాల మిత్తం ప్రతి పేదవాడు ఇల్లు కట్టుకోవాలనే లక్ష్యంతో ఇసుకను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాదు, మాజీ మండల కన్వీనర్ లక్ష్మణ, మాజీ ఎంపీటీసీ ఇదమ్మా, గ్రామ సర్పంచ్ బడిపాటి ఓబులు, మాజీ సర్పంచ్ వేముల కషయ్య, కాయగోకల ఎల్లయ్య, ఎంపీటీసీ మేడికొండ రాధాకృష్ణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తును నాయకులు

హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో ప్రభుత్వ బీసీ వసతి గృహానికి శాశ్వత వసతి భవనాలు నిర్మించాలని జాతీయ బీసీ జేఏసీ యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షుడు పోసా శ్రీరాములు కోరారు. సోమవారం యర్రగొండపాలెం పట్టణంలో తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఈ మేరకు తహశీల్దార్ సోమ్లా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోసా శ్రీరాములు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ బీసీ వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. అద్దె భవనాలలో కనీస వసతులు లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధికార ప్రతిధి పాలూరి శ్రీను, మండల అధ్యక్షుడు జక్కి సుబ్బారావు, నాయకులు నాగరాజు, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న గ్రామస్థులు

పాఠశాలలో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం నల్లగుంట్లలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో వసతులు కల్పించాలని గ్రామస్థులు సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి, తరగతి గదులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వారితో మాట్లాడుతూ డీఈవో దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, సిపిఎం నాయకులు ఆవులయ్య, రైతు సంఘం నాయకులు మండ్ల చంద్రపాల్, షేక్ మహబూబ్ బాషా, కాశయ్య నాయిబ్ రసూల్, బొడ్డు రామరాజు, గాలి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెద్దదోర్నాల–2 రైతు సేవా కేంద్రంలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి డి జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ కౌలు రైతులందరూ విధిగా పంట సాగు హక్కు పత్రాలు పొందాలని, తద్వారా ప్రభుత్వం పథకాలకు అర్హత పొందుతారని తెలిపారు. సిసిఆర్ కార్డు పొందటానికి కౌలు రైతు తను సాగు చేస్తున్న రైతు పేరు, భూమి సర్వే నెంబర్ వివరాలను సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి తెలియపరిస్తే కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. దీని కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే అని, యజమాని యొక్క యాజమాన్య హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లకుండా చట్టం కూడా చేయటమైనదన్నారు. యజమానులు కూడా సహకరించాలని కోరారు. సిసిఆర్సీ కార్డుల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కౌలు రైతులకు సంవత్సరానికి రూ.13,500 అందజేయబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.



పెద్దారవీడులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి బుజ్జిబాయి

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, బి.చెర్లోపల్లి రైతు సేవా కేంద్రంలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ కౌలు కార్డులు తీసుకోవడం వల్ల రైతులు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సబ్సిడీలో పొందవచ్చున్నారు. పెద్దారవీడు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో కందులు, మినుములు కావలసిన రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.బుజ్జిబాయ్, వీఆర్‌వో వెంగళరెడ్డి, వ్యవసాయ సహాయకులు లాల రవి, ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలోని సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్జీదారులు సంతప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల విభాగాధిపతులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్జీదారులకు నిర్ణీత గడువు లోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ .ఆర్ గోపాలకృష్ణ, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వర కుమార్, ఝాన్సీ లక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

అర్జీల పట్ల అశ్రద్ధ వహిస్తే సహించం..

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని కలెక్టర్ జె.వెంకటమురళి హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. 112 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తామన్నారు. కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని కలెక్టర్ చెప్పారు. నిర్లిప్తంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందకపోతే మరొకరితో విచారణ జరిపించాలని ఆదేశించారు. రేపల్లె ఆర్డీవో పరిధిలో మూడు, విద్యుత్ శాఖలో రెండు, మునిసిపాలిటీలో మరొకటి మిగిలినవి ఆయా శాఖల్లో ఇప్పటికే 17 అర్జీలు పునరావతం అయ్యాయన్నారు. వాటిపై ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మీ వద్దకు వచ్చిన బాధితులకు సాధ్యమైనంతవరకు మీ పరిధిలో న్యాయం చేయాలని, అలా చేయలేకపోతే సాధ్యం కాదని వివరిస్తూ స్పష్టంగా చెప్పాలన్నారు. ఆర్ఓఆర్ లో ఉన్న వివరాలు పూర్తి స్థాయిలో స్థిరంగా ఉంటాయని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వలు, చెరువుల పూడికతీత పనులలో 100 రోజులు పని దినాలు తగ్గకుండా నిరుపేదలకు ఉపాధి చూపాలని అధికారులను ఆదేశించారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై అధికారులు ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. నకిలీ విత్తనాలతో వివిధ పంటలు సాగు చేసే రైతులు, ఆక్వా రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాల్వల మరమ్మతు పనులపై ఎంపీడీవోలు, తహశీల్దార్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రస్తుతం పశ్చిమ, కష్ణా డెల్టా నుంచి నీరు విడుదలైనందున తాగునీటి చెరువులన్నింటినీ పూర్తిగా నింపాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త డంప్ చేయడం, తగులబెట్టడం వంటివి చేయరాదని స్పష్టం చేశారు. చెత్త సంపద కేంద్రాలు నూరు శాతం వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వేటపాలెంలో పశువులకు వైద్యం అందడం లేదనే ఆరోపణలపై ఆరా తీశారు. డిప్యూటేషన్‌పై విశాఖ జిల్లాకు వెళ్లిన సదరు వైద్యాధికారి వేతనం నిలిపివేయాలని, తక్షణమే నోటీస్ జారీ చేయాలన్నారు. అనుమతులు లేకుండా జిల్లా అధికారులు బాపట్ల కేంద్రాన్ని దాటి వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై ఈ నెల 18 నుంచి ఇంటింటా పరిశీలన జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీవో జి రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు కోసం ఆంజనేయులు కృషి

- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు
- దామచర్ల ఆంజనేయులుకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా శ్రేయస్సుకు స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు కృషి చేశారని ఆయన మనవడు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు కొనియాడారు. మాజీ మంత్రి, కీర్తిశేషులు దామచర్ల ఆంజనేయులు 95వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఒంగోలు నగరంలోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న దామచర్ల ఆంజనేయులు విగ్రహానికి, టిడిపి కార్యాలయం లోని విగ్రహానికి ఒంగోలు ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.రాజ్ విమల్, వై.శశికాంత్


ఆంజనేయులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

భూషణ్, గోగినేని రామా రావు, బండారు మదన్, తాతా చెంచయ్య గుప్తా, దాయనేని ధర్మ, 29వ డివిజన్ అధ్య క్షులు పెద్దిశెట్టి చంద్ర, మహిళా నాయకురాళ్ళు టి.అనంతమ్మ, నాళం నరసమ్మ, పసుపులేటి సునీత, గంగవరపు పద్మావతి, కొక్కిలిగడ్డ లక్ష్మి, తెలుగునాడు రాష్ట్ర అంగన్‌వాడీ, డ్వాక్రా కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, టిడిపి, బిజెపి. జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పరిధిలో అనుమతులు లేకుండా కొండలను తవ్వి మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మార్కాపురం డివిజనల్ గనులు మరియు భూగర్భ శాఖ అధికారి విష్ణువర్ధనరావు తెలిపారు. సోమవారం 'ప్రజాశక్తి' జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన 'కొండ పిండి' అనే కథనానికి ఆయన స్పందించారు. అనుమతులు లేకుండా కొండలను తవ్వి మట్టి తరలిస్తున్న వారికి ఇప్పటికే రూ.10,37,428 జరిమానాలు విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఘటనపై విఆర్ఒను వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. నిత్యం తనిఖీలు చేస్తుంటామని తెలిపారు.

పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పత్తి విత్తనాలను అధిక ధరలక విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకంటామని యర్రగొండ పాలెం వ్యవసాయ సహాయ సంచాలకరాలు కె నీరజ అన్నారు. ఈ నెల 15న ప్రజాశక్తి దినపత్రికలో 'బ్లాక్‌లో పత్తి విత్తనాల విక్రయం' అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. యర్రగొండపాలెం మండలంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సోమవారం సంయుక్తంగా విత్తనాల షాపులను తఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. షాపులలో పత్తి విత్తనాల నిల్వలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా విత్తన నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి కెవి శేషారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న నీరజ

ప్రజాశక్తి కథనానికి స్పందన

సాగర్ పైపులైన్‌కు మర్మమతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో చైతన్య నగర్‌లో గల మసీదు లైన్ వీధిలో సాగర్ నీరు అందించేందుకు వేసిన పైపులైన్ (ఇనుప పైపులు) శిథిలమై పెద్ద రంధ్రాలు పడ్డాయి. నీరు వదిలిన ప్రతిరోజూ వృథాగా పోతుంది. దీనిపై ఈ నెల 15న 'సాగర్‌నీటి సరఫరా పైపు లీకేజీ' శీర్షికన వార్త ప్రచురితమైంది. వార్తకు స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ యర్రగొండపాలెం మండల ఏఈ శ్రీకాంత్.. సిబ్బందిని పంపి.. మరమ్మతులు చేయించారు. నీరు వృథాగా పోకుండా అరికట్టారు.


సమస్యలు వింటున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి..

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 43 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను అడిషనల్ ఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ సిహెచ్.సింగయ్య , ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హిజ్రాలకు గుర్తింపు కార్డులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాలోని పలువురు హిజ్రాలకు కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా గుర్తింపు కార్డులు అందజేశారు. మద్రిపూడి మండలం రేగళ్లగడ్డ గ్రామానికి చెందిన వయోవద్ధుడు లక్ష్మీనరసింహకు శ్రవణ యంత్రం అందజేశారు. ఒంగోలు పట్టణానికి చెందిన గోపనబోయిన మానస, హాప్సిక, గంగోత్రిబొప్పన మైత్రికే ఆరాధ్య,కే భార్గవి, లల్లి, అమూల్య, స్వరని రమ్యరెడ్డి సునీత, అక్షయ, మానస అను 13 మంది హిజ్రాలు ఇందుకోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతలు పరిశీలించిన తరువాత సోమవారం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ దరఖాస్తుదారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, జిల్లా వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి అర్చనతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు రక్షణ

వాల్ పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాహనదారులు హెల్మెట్ వినియోగించటంతో ప్రాణాలకు రక్షణ ఉంటుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొ న్నారు. స్థానిక ప్రకాశం భవనం సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమంలో హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా రవాణా శాఖ రూపొందించిన వాల్ పోస్టర్లు, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. హెల్మెట్ వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారేజ్ వర్కర్ల

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు డిపోలో 18 నెలల వేతన బకాయిలు, విచారణ కేంద్రం, గ్యారేజ్ వర్కర్ల వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఎపిఎస్ ఆర్టీసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. ఒంగోలు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద ఎపిఎస్ ఆర్టీసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వి తులసీరామ్ మాట్లాడుతూ ఒంగోలు డిపోలో విచారణ కేంద్రం, గ్యారేజ్ వర్కర్స్‌కు ఆరు నుండి 18 నెలల వరకు ఉన్న వేతన బకాయిలు చెల్లించాలన్నారు. సర్క్యులర్ నెంబర్ 41/2007ను అద్దె బస్సు డ్రైవర్ కు అమలు చేయాలన్నారు. ఆర్టీసీ టెండర్ లో పేర్కొన్న విధంగా డ్రైవర్లకు వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, లేబర్ చట్టాలు అమలు చేయాలపి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఆర్టీసీ యాజమాన్యం ఇస్తున్న నోటిఫికేషన్ సర్క్యులర్‌ను నోటీసు బోర్డు ద్వారా కార్మికులకు తెలియజేయాలన్నారు. లేబర్ చట్టాలలో వేతనాలు అమలు చేయాలని, చేయని కాంట్రాక్టర్ పై చర్యలు



నిరసన తెలుపుతున్న నాయకులు

తీసుకోవాలన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు, కాంట్రాక్ట్ డ్రైవర్లకు అప్పీలు సౌకర్యం కల్పించాలని ఆర్టీసి ఎమ్‌డి ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు. ప్రతి నెలా 10వ తేదీలోపు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని, వర్కర్స్ ఏటీఎం కార్డులు పాస్ బుక్‌లు వారి వద్దనే ఉంచాలన్నారు. ఈఎస్ఐ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఏపీఎస్ ఆర్టీసీకి రీజినల్ మేనేజర్, ఒంగోలు డిపో మేనేజర్‌కు సంబంధిత సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా రోడ్ ట్రాన్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బివి రావు, ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.